క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం



చౌహాన్ అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండల పరిధిలోని పలుగు తండాకు చెందిన చౌహాన్ అమర్‌సింగ్ సిద్దిపేట జిల్లా తగడ్లపల్లి సరస్వతి శిశుమందిర్‌లో చదివి ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించాడు. ప్రతిభ చూపిన ఆ విద్యార్థిని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆదివారం క్యాంపు కార్యాలయంలో సన్మానించి అభినందించారు. జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్ ఆ విద్యార్థికి రూ.5వేలను అందజేశారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు నవాబ్, జుజాల్‌పూర్ సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న ప్రకాశ్ రాథోడ్

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని గ్రామాలు, గిరిజన తండాలకు మంజూరైన నూతనంగా రోడ్లు నిర్మించడంతో పాటు గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు ప్రారంభించాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాశ్ రాథోడ్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో ఆదివారం సంఘం నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేడ్-ఫత్తేపూర్, మూడుగుంటల చౌరస్తా- సంజీవన్‌రావుపేట్, ఖేడ్-కరస్‌గుత్తి తదితర రహదారులు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. రోడ్ల నిర్మాణాలు, మరమ్మతుల పనులకు రూ.కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే చెబుతున్నారు తప్ప పనులు ప్రారంభించడంలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సురేష్‌నాయక్, జిల్లా, డివిజన్ నాయకులు గోపాల్, వినోద్, వంశీ, రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



భజనలు చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: నగర సంకీర్తన కార్యక్రమాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పెద్దగుడి, హమాలీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం భక్తులు భజనలు, కీర్తనలు ఆలపిస్తూ పాదయాత్ర నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కొనసాగుతున్న ఎల్లమ్మ జాతర



పూజలు చేస్తున్న భక్తులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: మండల కేంద్రమైన చౌట్కుర్‌లో రేణుకా ఎల్లమ్మ జాతర కొనసాగుతోంది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మఠం బిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభులింగం, నరసింహాగౌడ్ పాల్గొన్నారు.

భూంగొండేశ్వర విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల పరిధిలోని తోర్నాల్ గ్రామంలో గొల్లకుర్మల ఆరాధ్యదైవం అయిన భూంగొండేశ్వర విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అవధూత్‌పూర్ మహారాజ్ మచ్చేందర్, మహారాజ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి, నాయకులు గోవింద్‌యాదవ్, ఓంప్రకాశ్, కాలే రాజు, హన్మంత్, తుకారాం, దశరథ్, అర్జున్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

- మార్కెట్ గంజ్ ఎదుట నిలిచిన మురుగునీరు
- పొంచి ఉన్న ప్రమాదం
- రోడ్డుపై పారుతున్న మురుగునీరు



జోగిపేట మార్కెట్ గంజ్ ఎదుట అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

జోగిపేట(అందోల్): అందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రం ఎదుట ఉన్న కల్వర్టు వద్ద మురుగునీరు నిల్వ ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు ఆదమరిచి వాహనాలను నడిపిస్తే పెద్ద ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. గుట్టపై నుంచి వచ్చే మురుగునీరంతా కల్వర్టు ద్వారా చెరువులోకి వెళ్లాల్సి ఉండగా కల్వర్టులో చెత్తపేరుకుపోయి ఉండటంతో నీరు ముందుకు ప్రవహించకుండా అక్కడే నిలిచిపోయి కుంటగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరంతా రోడ్డుపైకి చేరి మార్కెట్‌లోకి ప్రవేశిస్తోంది. కల్వర్టులో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేస్తున్నా సమస్య మళ్లీ మొదటికే వస్తోంది. ఈ రోడ్డు గుండానే వందలాది వాహనాలు, ప్రజలు సంగారెడ్డి, అందోలు, చౌటకూరు, శివ్వంపేట ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

హనుమాన్ ఆలయం వద్ద..

స్థానిక పబ్బతి హనుమాన్ దేవాలయం ప్రహరీని ఆనుకొని ఉన్న మురుగుకాలువ పెద్ద గుంతగా మారింది. ఈ రోడ్డు గుండా వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా హనుమాన్ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటారు. టర్నింగ్ పాయింట్‌లోనే గుంత పెద్దగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగుకుంటను తొలగించేవిధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కల్వర్టు నిర్మాణం చేపడతాం



వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద మురుగునీరు నిల్వకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటాం. ఇటీవల మున్సిపల్ చైర్మన్‌తో కలిసి ఈ పనులకు సంబంధించిన ప్రణాళికను రూపొందించాలని సంబంధిత ఏఈకి సూచించాం. ప్రతిపాదనలు తయారు చేసి చిన్నగా ఉన్న కల్వర్టును కలిపి మరికొంత దూరం కల్వర్టు నిర్మాణం చేపడతాం. హనుమాన్ మందిరం నుంచి గొనివరకు మురుగుకాలువల నిర్మాణం చేపట్టేందుకు రూ.కోటి కేటాయించాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– మారుతి, మున్సిపల్ కమిషనర్, అందోల్, జోగిపేట

లింగాయత్ మహార్యాలీకి తరలిరావాలి



ప్రచారం చేస్తున్న అక్కనబళగ సభ్యులు

రాయికోడ్(అందోల్): జూన్ 4న హైదరాబాద్‌లో నిర్వహించే వీరశైవ లింగాయత్‌ల మహార్యాలీకి వీరశైవ లింగాయత్, లింగబలిజలు తరలిరావాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్ పిలుపునిచ్చారు. రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పాటిల్‌తో కలిసి మహార్యాలీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరశైవులు ఐకమత్యంతో ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శరణ్ ప్రసాద్, గొరీశ్వర్, ప్రవీణ్ పాటిల్, ఆలయ అర్చకులు, కృష్ణ, వీరయ్య స్వామి, బసయ్య స్వామి, రంగనాథ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌లో జూన్ 4న తెలంగాణ లింగాయత్ సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మహార్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం లింగాయత్ సమాజ్, రాష్ట్రీయ బసవదళ్, అక్కనబళగ సభ్యులు పిలుపునిచ్చారు. జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాయత్‌లను ప్రత్యేక ధర్మంగా గుర్తించాలన్నారు. అనంతరం చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న గిరిజన మహిళలు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని తెల్లరాళ్ల తండాలో జగదంబ సేవలాల్ మహారాజ్ ఆలయ 25 వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాభక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌నాయక్, ఉప సర్పంచ్ రాములనాయక్, ఎంపీటీసీ లక్ష్మీబాయి, పూజారి శీనునాయక్, సురేష్, తండావాసులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): మండలంలోని హస్నాబాద్ గ్రామంలో ఆదివారం జరిగిన కిషన్ కుమారుడి వివాహ వేడుకకు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరై వధూవరులు శ్రవణ్‌కుమార్, శివలీలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ రజినికాంత్, సర్పంచ్ మన్మంతు, వరము సంఘం చైర్మన్ వీరారెడ్డి, నాయకులు శంకర్, సాయికుమార్, మల్లేశం, అంజి, ప్రశాంత్‌పాటిల్, విశ్వనాథ్, నాగరాజు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.



వధూవరులతో కాంగ్రెస్ నాయకులు

వివాహానికి కాంగ్రెస్ నాయకుల హాజరు

రాయికోడ్(అందోల్): మండలంలోని సంగాపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ప్రవీణ్ వివాహానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు విదర్శన్‌రెడ్డి, రఫిక్‌మియా, ప్రశాంత్, రాములు, అజయ్, ప్రసాద్, శామ్, ప్రశాంత్, మోహన్ పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కొల్లూర్ గ్రామంలో దుర్గాభవానిమాత, మాతంగి, నాగదేవత ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతకు భక్తులు బోనాలను సమర్పించారు. డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

అడ్డగోలు వసూలు

శివ్వంపేట(నర్సాపూర్): వరికోత సీజన్‌ను ఆసరాగా చేసుకొని దళారులు ఇష్టరాజ్యంగా రైతుల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. వరికోతకు యంత్రాల దళారులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని రైతులు వాపోయారు. చైన్ మిషన్ గంట కోతకు 3500, టైర్ యంత్రం గంటకు 2200 నుంచి 2700 వసూలు చేస్తున్నట్లు పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు , ప్రజాప్రతినిధులు స్పందించి, నిర్దేశించిన ప్రకారం వరికోతకు యంత్రాల యజమానులు వరికోతకు డబ్బులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్ టౌన్: సీఎం రిలీఫ్‌ఫండ్‌లో భాగంగా మంజూరైన నిధుల ఎల్‌ఓసీని జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ లబ్ధిదారురాలకు ఆదివారం అందజేశారు. పట్టణానికి చెందిన అనీస్ ఫాతిమా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందారు. ఆర్థికసాయానికి ఎంపీని కోరగా ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 2.50 లక్షలు మంజూరు చేయించి ఎల్‌ఓసీని అందజేశారు.

16న ఉపకులాల పోరాట సమితి సమావేశం

నర్సాపూర్: ఈనెల 16న ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం సిద్దిపేటలో ఏర్పాటు చేసినట్లు హోళియదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి చెప్పారు. 16న సమావేశం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎస్సీ ఉపకులాలకు చెందిన సంఘం సభ్యులు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సిద్ధివినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు తన్వీర్, నాయకులు, ప్రజాప్రతినిధులు గౌసోద్దీన్, నర్సింహారెడ్డి, దెశెట్టి పాటిల్, నామ రవికిరణ్, మోతీరాం, మల్‌రెడ్డి, వీరారెడ్డి, కుత్బోద్దీన్, రఫీయోద్దీన్, జనార్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హనీఫ్, మాజీద్ పాటిల్ పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

నారాయణఖేడ్: టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి జన్మదినాన్ని ఆదివారం పీఆర్ ఎస్ యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పెద్దశంకరంపేట మండలంలోని రామోజీపల్లి, దానంపల్లి గ్రామాలకు చెందిన సంజీవరెడ్డి అభిమానులు శ్రీనివాస్, జయేందర్, శంకర్, వెంకటేశం, శివకుమార్ తదితరులు సంజీవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ×నారాయణఖేడ్ జనగర్జన? పేరిట సీడీని రూపొందించారు. ఆట్టి సీడీని ఖేడ్‌లోని సంజీవరెడ్డి నివాసంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

నారాయణఖేడ్: మందిరాల నిర్మాణానికి కేంద్ర ఆహార సంస్థ మాజీ డైరెక్టర్, విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ రూ.21వేల విరాళం అందజేశారు. నారాయణఖేడ్ మండలం కొండాపూర్ స్కూల్‌తండాలో నిర్మించనున్న భవానీమాత, సేవాలాల్ మహారాజ్ మందిరాలను ఆదివారం తండాను సందర్శించి విరాళం అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్‌కు కమిటీ బాధ్యులు శాలువాతో సన్మానించారు.

వైభవంగా దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రంజోల్‌లో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయ ఆలయంలో ఆదివారం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రాచయ్యస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. కార్యక్రమంలో బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవదూత దత్తగిరి మహారాజ్, వివిధ పార్టీల నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం అని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేవునిపల్లికు చెందిన బీఆర్‌ఎస్ క్రియశీలక కార్యకర్త కమ్మరి పుష్పల మరణించడంతో ఆమె కూతురు నామినీ కమ్మరి గోవిందమ్మకు పార్టీ తరపున రూ.2లక్షల బీమా చెక్కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నే సులోచన, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, మన్నే హన్మండ్లు, మన్నే భూపాల్, నారాయణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న మాణిక్యం

నారాయణఖేడ్: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్యం అన్నారు. నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ ప్రాంత స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని మండిపడ్డారు. అంతేకాకుండా ఇంధనం, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను పెంచి మోయలేని భారాన్ని మోపిందన్నారు. కర్ణాటక ఓటర్లు బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. ఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధితో వలసలను నివారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఖేడ్ ప్రాంత కమిటీ కార్యదర్శి చిరంజీవి, నాయకులు కొటారి నర్సింహులు, గణపతి, శంకర్, సంతోష్‌రెడ్డి, రమేష్, అరుణ్, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



బొంతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో ఆదివారం హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొంతపల్లిలో హనుమాన్ విగ్రహంతో భారీ ర్యాలీ నిర్వహించారు. జైశ్రీరాం, జైహనుమాన్ నినాదాలతో గ్రామాలు మారుమోగాయి.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని ఆ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గం కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని పార్టీ అధ్యక్షులతో ఆదివారం పట్టణంలో సమావేశం నిర్వహించి కమిటీ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగైదు నెలల్లో సాధారణ ఎన్నికలు వస్తాయని, అప్పటివరకు పార్టీని బలోపేతం చేయాలన్నారు. అదేవిధంగా పూర్తిస్థాయిలో పార్టీ కమిటీలను వేసి సర్పంచ్, జెడ్పీటీసీ ఎంపీటీసీలతో పాటు మాజీ ప్రజాప్రతినిధులను సైతం కలుపుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం కోఆర్డినేటర్ నర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, న్యాల్కల్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, నర్సింహ్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

జిన్నారం(పటాన్‌చెరు): కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బొల్లారం మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ యువజన నాయకులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

ఘనంగా మదర్స్ డే



సునీతారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: మదర్స్ డేను పురస్కరించుకొని నర్సాపూర్‌కు చెందిన పలువురు యువకులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆదివారం పలు కార్యక్రమాలు చేపట్టారు. పట్టణానికి చెందిన చైతన్య, శ్యాం, నవీన్, శరత్, శశి తదితరులు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వ్యక్తులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే నర్సులు, ఆయాలతో కేక్ కట్ చేయించి, అందరికి మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో మాతృదినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డిని గోమారంలోని ఆమె నివాసంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చిటుకల్ మైపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ హన్మంత్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ లాయక్, బీఆర్‌ఎస్ నాయకులు వీరేష్, సత్యంగౌడ్, లక్ష్మణ్ ఉన్నారు.

కర్ణాటక కాంగ్రెస్ నాయకులకు ఘన స్వాగతం

పటాన్‌చెరు టౌన్: కర్ణాటక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వర కంద్రే, బీదర్ ఎమ్మెల్యే రహీంఖాన్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొంది శాసన సభాపక్ష సమావేశానికి బీదర్ నుంచి బెంగళూర్‌కు వెళ్లేందుకు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్తున్న సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలో వారికి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, యువరాజమోరే, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఈశ్వరకంద్రే, రహీంఖాన్‌ను సన్మానిస్తున్న నాయకులు